క్లుప్తంగా

ప్రజలకు మెరుగైన సేవలు అందించాలి

కోవూరు: గ్రామ సచివాలయ సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండి మెరుగైన సేవలు అందించాలని డీపీఓ సుస్మితారెడ్డి సూచించారు. పడుగుపాడు సచివాలయాన్ని మంగళవారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం సచివాలయ సిబ్బందికి సూచనలు చేశారు. ఆమె వెంట ఈఓపీఆర్డీ కల్పన, పంచాయతీ కార్యదర్శి కృష్ణమూర్తి, సచివాలయ సిబ్బంది ఉన్నారు.

బైక్ అపహరణ

నెల్లూరు సిటీ: బైక్ అపహరణకు గురైన ఘటనపై దర్గామిట్ట పోలీసులు కేసును మంగళవారం నమోదు చేశారు. పోలీసుల వివరాల మేరకు.. ఏపీ జెన్‌కోలో సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్న ముత్తుకూరు మండలం సింహాద్రినగర్‌కు చెందిన వెంకయ్య తన పల్సర్ బైక్‌పై నగరానికి ఈ నెల 13న వచ్చారు. ఎంజీబీ మాల్ సమీపంలో బైక్‌ను నిలిపి సినిమాకు వెళ్లారు. తిరిగొచ్చేసరికి బైక్ కనిపించకపోవడంతో గాలింపు చర్యలు చేపట్టారు. అయినా ప్రయోజనం లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

హత్యాయత్నం కేసులో నిందితుడి అరెస్ట్

నెల్లూరు (క్రైమ్): చెప్పులు కుట్టుకునే వ్యక్తిపై మద్యం మత్తులో కత్తితో దాడి చేసి గాయపర్చిన కేసులో నిందితుడ్ని చిన్నబజార్ పోలీసులు మంగళవారం అరెస్ట్ చేశారు. ఇందుకు సంబంధించిన వివరాలను ఎస్సై సైదులు తెలియజేశారు. వీఆర్సీ ప్రాంతంలో ప్రకాష్ అనే వ్యక్తి చెప్పులు కుట్టుకుంటూ జీవనం సాగిస్తున్నారు. సంతపేటలోని బుజ్జమ్మరేవుకు చెందిన శేషు మద్యం మత్తులో ప్రకాష్‌ను కత్తితో పొడిచి హత్యాయత్నానికి ఆదివారం పాల్పడ్డారు. స్థానికులు రావడంతో అక్కడి నుంచి నిందితుడు పరారయ్యాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు హత్యాయత్నం కేసును నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పరారీలో ఉన్న శేషును వాకర్స్ రోడ్డు సమీపంలో అదుపులోకి తీసుకొని దాడికి వినియోగించిన కత్తిని స్వాధీనం చేసుకున్నారు. శేషును అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపర్చారు.

యువతి అదృశ్యం

నెల్లూరు సిటీ: యువతి అదృశ్యమైన ఘటనపై బాలాజీనగర్ పోలీసులు కేసును మంగళవారం నమోదు చేశారు. పోలీసుల వివరాల మేరకు.. పద్మావతినగర్‌లోని పుట్టవీధిలో నివసిస్తున్న ఓ యువతి నగరంలోని ఓ కళాశాలలో డిగ్రీ తృతీయ సంవత్సరం చదువుతోంది. ఆమెను కళాశాల వద్ద సోదరుడు సోమవారం వదిలి వచ్చారు. సాయంత్రమైనా ఇంటికి యువతి రాకపోవడంతో కళాశాలకు వెళ్లి తండ్రి ఆరా తీశారు. కళాశాల నుంచి వెళ్లిపోయిందని వారు సమాధానమిచ్చారు. దీంతో ఆమె కోసం గాలింపు చర్యలు చేపట్టారు. అయినా ప్రయోజనం లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

విధులకు ఆటంకంపై కేసు నమోదు

నెల్లూరు(క్రైమ్): కమిషనర్‌తో పాటు సిబ్బంది విధులకు ఆటంకం కలిగించిన పలువురిపై వేదాయపాళెం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. స్పందన పిటిషన్ విచారణలో భాగంగా కమిషనర్ వికాస్ మర్మత్ తన సిబ్బందితో కలిసి చైతన్యపురికాలనీలోని పార్కు స్థలం వద్దకు వెళ్లారు. పార్కును పరిశీలిస్తుండగా బీజేవైఎం నేత సురేష్‌తో పాటు పెంచలయ్య, అస్లామ్, మల్లికార్జున, వెంకటేశ్వర్లు, మునిశేఖర్, అశోక్, రాంబాబు, పుష్పరాజ్, సాయిసునీల్ అడ్డుకొని వారి విధులకు ఆటంకం కలిగించడమే కాకుండా దౌర్జన్యం చేశారు. ఈ మేరకు పోలీసులకు కమిషనర్ కారు డ్రైవర్ చిన్నయ్య ఫిర్యాదు చేశారు. దీంతో నిందితులపై కేసు నమోదు చేశారు.

ఉత్సాహంగా క్రికెట్ పోటీలు



నెల్లూరు (వేదాయపాళెం): నగరంలోని వీఆర్ హైస్కూల్ గ్రౌండ్స్‌లో మే డే ఉత్సవాలను ఆటో కార్మిక సంఘ నగర కమిటీ ఆధ్వర్యంలో ప్రారంభించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ట్రాఫిక్ డీఎస్పీ సుబహాన్ మాట్లాడారు. క్రికెట్ పోటీలకు సంబంధించి పది జట్లు రిజిస్ట్రేషన్ చేసుకోవడాన్ని అభినందించారు. ఆటో కార్మిక సంఘ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రాజా, సురేష్, నేతలు శ్రీనివాసులు, సూర్యనారాయణ, సుధాకర్, నాగూర్, వెంగయ్య, తదితరులు పాల్గొన్నారు.

పాస్టర్స్ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శిగా జెర్మియా

నెల్లూరు(బృందావనం): ఆంధ్రప్రదేశ్ పాస్టర్స్ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శిగా ముత్తుకూరు మండలం నేలటూరుకు చెందిన రెవరెండ్ జెర్మియాను నియమించారు. దీనికి సంబంధించిన నియామక పత్రాన్ని మూలాపేటలోని హెర్మోన్ చర్చిలో ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు రెవరెండ్ రాజశేఖర్ మంగళవారం అందజేశారు. నేతలు ప్రేమ్‌కుమార్, సజీవరావు, సందీప్ ప్రిన్స్, ఆంథోనీ, జోసఫ్‌బాబు, చక్రిబాబు, శ్యామ్, వేదాంత్ పాల్గొన్నారు

మత్స్యకారుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి

- కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి



సంక్షేమ పథకాల కరపత్రాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి

ఇందుకూరుపేట: మత్స్యకారుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని పల్లిపాడులో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని మంగళవారం ఆయన నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. ప్రభుత్వ పనితీరు, సంక్షేమ పథకాల అమలుపై ఆరాతీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వైఎస్సార్ మత్స్యకార భరోసా పథకం మత్స్యకారుల పాలిట వరమన్నారు.దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్రంలో వేటనిషేధ సమయంలో మత్స్యకార కుటుంబాలకు రూ.10వేలు పరిహారం అందజేస్తున్నట్లు తెలిపారు. గత టీడీపీ హయాంలో రూ.4వేలు మాత్రమే అందించిన విషయాన్ని గుర్తుచేశారు. వైఎస్సార్ మత్స్యకార భరోసా పథకం కింద జిల్లా వ్యాప్తంగా నాలుగేళ్లలో రూ.56.41 కోట్లు అందజేయగా, ఐదో విడతగా రూ.12.07 కోట్లు లబ్ధిదారుల ఖాతాలో జమ చేస్తున్నట్లు తెలిపారు. కోవూరు నియోజకవర్గంలో నాలుగేళ్లలో రూ.13 కోట్లు అందజేయగా, ఐదో విడతగా రూ.3.02 కోట్లను జమచేస్తున్నట్లు వివరించారు. ఇందుకూరుపేట మండలంలో నాలుగేళ్లలో రూ.4.55 కోట్లు అందజేయగా, ఐదో విడతగా రూ.1.24 కోట్లను జమ చేస్తున్నట్లు తెలిపారు. పల్లిపాడు గ్రామాన్ని ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి దత్తత తీసుకుని అభివృద్ధి పనులకు ఎంపీ నిధులు దాదాపు రూ.3 కోట్లు కేటాయించారని వివరించారు. అభివృద్ధి పనులు పూర్తయ్యాయని, అందుకు ఎంపీకు ధన్యవాదాలు తెలియజేస్తున్నామన్నారు. జలజీవన్ మిషన్ పథకం క్రింద గ్రామంలోని ప్రతిఇంటికి తాగునీరు అందించేందుకు రూ.1.35 కోట్లు విడుదలయ్యాయని తెలిపారు. ఇందుకు సంబంధించిన టెండర్లు పూర్తి చేసి పనులు ప్రారంభించామన్నారు. రెండు నెలల్లో పనులు పూర్తి చేసి ప్రతి ఇంటికి తాగునీటిని అందిస్తామని తెలిపారు. గడప గడపకు మన ప్రభుత్వంలో భాగంగా కోవూరు నియోజకవర్గంలో ఇప్పటి వరకు 61 సచివాలయాల పరిధిలో 70,487 గృహాలను సందర్శించామన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సచివాలయ వ్యవస్థ ద్వారా పారదర్శకంగా గడప గడపకు సంక్షేమ పథకాలను అందించడంతో ప్రజలు ఆనందంగా ఉన్నారన్నారు. ప్రతిపక్షాలు ఎన్ని విమర్శలు చేసిన ప్రజల ఆశీర్వాదం సీఎం వైఎస్ జగన్‌కు ఉంటుందన్నారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మావులూరు శ్రీనివాసులురెడ్డి, ఏపీఎల్‌డీఏ చైర్మన్ గొల్లపల్లి విజయ్‌కుమార్, డీసీఎమ్మెస్ డైరెక్టర్ గునుపాటి సురేష్‌రెడ్డి, తహసీల్దార్ సుబ్బయ్య, ఎంపీడీఓ కే నాగేంద్రబాబు, సీఐ కే రామకృష్ణారెడ్డి, ఎస్సై వెంకటరాజేష్, నాయకులు కొండ్లపూడి శ్రీనివాసులురెడ్డి, షేక్ షబ్బీర్, గూడూరు జయరామయ్య, నెల్లూరు వెంకటేశ్వర్లు, మహేష్, సుమంత్‌రెడ్డి, చింతపంటి కృష్ణయ్య, డీ మధుసూదన్‌రెడ్డి, కైలాసం శ్రీనివాసులురెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

వేసవి శిబిరంతో విజ్ఞానం పెంపు



మనుబోలు: పేపర్ బొమ్మలు తయారు చేస్తున్న చిన్నారులు



కొడవలూరులో చిత్రలేఖన పోటీలను పరిశీలిస్తున్న కుమార్ రాజా

కొడవలూరు: వేసవి విజ్ఞాన శిబిరంతో విద్యార్థుల్లో విజ్ఞానం పెంపొందుతుందని జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి కుమార్‌రాజా స్పష్టం చేశారు. కొడవలూరు గ్రంథాలయంలో జరుగుతున్న వేసవి విజ్ఞాన శిబిరాన్ని మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవి విజ్ఞాన శిబిరంతో చిన్నారులకు పుస్తకాలు చదవడం అలవాటుగా మారి విజ్ఞానం పెంపొందుతుందన్నారు. చిత్రలేఖనంతో సృజనాత్మకత అలవడుతుందన్నారు. తల్లిదండ్రులు పిల్లలను విధిగా వేసవి శిబిరాలకు పంపాలని కోరారు. అనంతరం ఆయన తన జన్మదిన వేడుకలను చిన్నారుల నడుమ కేక్‌కట్ చేసి జరుపుకొన్నారు. విశ్రాంత హెచ్‌ఎం వెంకయ్య, లైబ్రేరియన్ కే రాజేశ్వరి, విద్యార్థులు పాల్గొన్నారు. యల్లాయపాళెం గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా విద్యార్థులకు చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు డీ వెంకటరమణారెడ్డి సొంత నిధులతో బహుమతులు అందజేశారు. పోటీలను విశ్రాంత ఉపాధ్యాయుడు వీ రమేష్ పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో లైబ్రేరియన్ జే సురేంద్రరెడ్డి పాల్గొన్నారు.

మనుబోలు: వేసవి విజ్ఞాన శిబిరం విద్యార్థుల మానసికోల్లాసానికి ఎంతో దోహదపడుతుందని మనుబోలు లైబ్రేరియన్ అరుణ్‌కుమార్ అన్నారు. మనుబోలు గ్రంథాలయంలో జరుగుతున్న వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా మంగళవారం విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించారు. పేపర్ క్రాఫ్ట్‌పై అవగాహన కల్పించి విద్యార్థులతో పేపర్ బొమ్మలు చేయించారు. యోగా శిక్షకుడు కోటేశ్వరరెడ్డి యోగా తరగతులు నిర్వహించారు.

వైభవంగా కల్పవృక్ష వాహన సేవ



పొదలకూరు : పట్టణంలోని శ్రీనివాస లేఅవుట్‌లోని శ్రీలక్ష్మీగోదా సమేత వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో ప్రథమ వార్షిక బ్రహ్మోత్సవాలను వైభవంగా నిర్వహిస్తున్నారు. ఉత్సవాల్లో భాగంగా మంగళవారం ఉదయం శ్రీవారికి కల్పవృక్ష వాహన సేవ నిర్వహించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. సాయంత్రం శ్రీవారిని విశేషంగా అలంకరించి అశ్వవాహనంపై కొలువుదీర్చి ఉత్సవం నిర్వహించారు. ఆలయ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు పెండ్యాల రమణయ్యనాయుడు, వాకాటి శ్రీనివాసులురెడ్డి, మన్నెం శ్యాంప్రసాద్, కొమ్మి వేణుగోపాల్, దాసరి శ్రీనివాసులు, చొప్పా వెంకటేశ్వర్లు, సన్నికంటి మురళి, తదితరులు పాల్గొన్నారు.

రూ.50 వేలు నగదు విరాళం

బ్రహ్మోత్సవాల నిర్వహణకు కేఆర్‌ఆర్ లేఅవుట్ యజమానులు సోమా భాస్కరరావు, మలిశెట్టి శివశంకర్ మంగళవారం రూ.50 వేలు విరాళంగా అందజేశారు. ఆలయ కమిటీ కార్యదర్శి వాకాటి శ్రీనివాసులురెడ్డికి నగదును అందజేశారు.

పలువురికి ఎమ్మెల్యే ప్రసన్న చేయూత



ఆర్థిక సాయం అందజేస్తున్న ప్రసన్నకుమార్‌రెడ్డి

ఇందుకూరుపేట: మండలంలోని కొత్తూరు, లేబూరు గ్రామాలకు చెందిన ఆరుగురికి ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి మంగళవారం చేయూత నందించారు. నల్లపరెడ్డి శ్రీనివాసులురెడ్డి చారిటబుల్ ట్రస్ట్ ద్వారా రూ.1.45 లక్షల సాయం అందజేశారు. కొత్తూరుకు చెందిన నెల్లూరు తిరుపాలు, వాకాటి పరంధామయ్య, సత్యశివకుమార్, జంగం వెంకటరమణయ్యకు వైద్యఖర్చులకు ఒక్కొక్కరికి రూ.20వేల చొప్పున రూ.80వేలు అందజేశారు. అదే గ్రామానికి చెందిన కిరణ్‌కుమార్‌కు విదేశీ విద్య కోసం రూ.50 వేలు సాయం చేశారు. లేబూరుకు చెందిన లక్ష్మయ్యకు వైద్యం కోసం రూ.15వేలు అందజేశారు.

భక్తిశ్రద్ధలతో అగ్నిగుండ మహోత్సవం



పందరి భజన ప్రదర్శిస్తున్న భక్తులు

పొదలకూరు : హనుమజ్జయంతి ఉత్సవాల్లో భాగంగా మండలంలోని తాటిపర్తిలో అగ్నిగుండ మహోత్సవాన్ని మంగళవారం వేకువన నిర్వహించారు. తొలుత గ్రామానికి చెందిన యువకులు పండరి భజనను ప్రదర్శించారు. అనంతరం భక్తిశ్రద్ధలతో అగ్నిగుండ ప్రవేశం చేశారు. తాటిపర్తి పరిసర గ్రామాల ప్రజలు హాజరై తిలకించారు.

ఏపీజీబీ మేనేజర్ బాధ్యతల స్వీకరణ



బీఎంగా బాధ్యతలు స్వీకరించిన నిఖిల్

మనుబోలు: ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంక్ మనుబోలు బ్రాంచ్ మేనేజర్‌గా బీ నిఖిల్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. వైఎస్సార్ జిల్లా బీ కోడూరు బ్రాంచ్ మేనేజర్‌గా పనిచేస్తున్న ఆయన బదిలీపై మనుబోలు బ్రాంచ్‌కు వచ్చారు. ఇప్పటి వరకు మనుబోలు బ్రాంచ్ మేనేజర్‌గా పనిచేస్తున్న రాజ్యలక్ష్మి వైఎస్సార్ జిల్లా రాజంపేట బ్రాంచ్‌కు బదిలీపై వెళ్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏపీజీబీలో డిపాజిట్లపై ఆకర్షణీయమైన వడ్డీలు చెల్లిస్తున్నామని తెలిపారు. మహిళా సీనియర్ సిటిజన్లకు డిపాజిట్లపై 7.80 శాతం వడ్డీ చెల్లిస్తున్నామని వివరించారు. బ్యాంక్ సేవలను ఖాతాదారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

డెంగీపై అవగాహన ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యారోగ్యశాఖ సిబ్బంది

పొదలకూరు : జాతీయ డెంగీ నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని పొదలకూరులో వైద్యారోగ్యశాఖ ఆధ్వర్యంలో మంగళవారం డెంగీపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి ఎం రమేష్ మాట్లాడుతూ డెంగీపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. డెంగీ దోమలతో వ్యాప్తి చెందుతుందని తెలిపారు. ఇళ్ల పరిసరాల్లో నీరు నిల్వ లేకుండా చూసుకోవడం, దోమ తెరలు వాడడంతో ద్వారా డెంగీకి చెక్ పెట్టవచ్చని తెలిపారు. ప్రతి శుక్రవారం డ్రైడేను విధిగా పాటించాలని సూచించారు. ఈ ర్యాలీలో మలేరియా సబ్‌యూనిట్ అధికారి ఆంజనేయవర్మ, వైద్యాధికారులు ఆదిలక్ష్మి, రవికుమార్, రమణమ్మ, అనూరాధ, సహాయకులు రాధాకుమారి, శివప్రసాద్, వెంకటేశ్వర్లు, కామాక్షమ్మ, మునిరాధిక, జ్యోతి, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల పరిశీలన



రోడ్డు చదును పనులను పరిశీలిస్తున్న కౌన్సిలర్ ప్రత్యూష

బుచ్చిరెడ్డిపాళెం: నగర పంచాయతీ పరిధిలోని మూడో వార్డులో చేపడుతున్న అభివృద్ధి పనులను కౌన్సిలర్ అందె ప్రత్యూష మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇటీవల గడప గడపకు మన ప్రభుత్వంలో భాగంగా మూడో వార్డులో పర్యటించిన ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి సీసీరోడ్డు, డ్రెయిన్ల నిర్మాణానికి సచివాలయ నిధులు రూ.20 లక్షలు మంజూరు చేశారని తెలిపారు. అందులో భాగంగా తొలుత రోడ్డు చదును పనులు చేపడుతున్నామని చెప్పారు. త్వరగా పనులను పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తామని తెలిపారు. వైఎస్సార్‌సీపీ నాయకులు సురేష్, ఫయాజ్ పాల్గొన్నారు.

నేడు గడప గడపకు మన ప్రభుత్వం

పొదలకూరు : మండలంలోని ఇనుకుర్తి, ముదిగేడు గ్రామాల్లో మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి బుధవారం సాయంత్రం 5 గంటలకు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ నగేష్ కుమారి మంగళవారం తెలిపారు. తొలుత ఇనుకుర్తి, ఆ తర్వాత ముదిగేడులో పర్యటిస్తారని చెప్పారు. ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరించడంతో పాటు ప్రజల సమస్యలను తెలుసుకుంటారని తెలిపారు. అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొనాలని కోరారు.

నేడు మంత్రి కాకాణి పర్యటన

మనుబోలు: మండలంలోని పిడూరులో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి బుధవారం పర్యటించనున్నట్లు స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకుడు మన్నెమాల సాయిమోహన్‌రెడ్డి మంగళవారం తెలిపారు. ఉదయం 10 గంటలకు మంత్రి గ్రామానికి చేరుకుని తొలుత నూతనంగా నిర్మించిన సచివాలయ భవనాన్ని ప్రారంభిస్తారని చెప్పారు. అనంతరం రామాలయం, మహాప్రస్థానాన్ని ప్రారంభిస్తారని తెలిపారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు హాజరుకావాలని కోరారు.

ఓఆర్ఎస్ ప్యాకెట్ల పంపిణీ



పొదలకూరు : మండలంలోని మొగళ్లూరులో ఉపాధి హామీ పథకం కూలీలకు సర్పంచ్ ఆకుల లక్ష్మి ఓఆర్ఎస్, గ్లూకోజ్, విటమిన్-బీ ప్యాకెట్లను మంగళవారం పంపిణీ చేశారు. తొలుత సర్పంచ్ ఉపాధి పనులను పరిశీలించి వేసవిలో కూలీలు తీసుకోవాల్సిన జాగ్రత్తలను సూచించారు. ఈ కార్యక్రమంలో సీహెచ్ఓ అమల, ఏఎన్ఎం అంకమ్మ, ఆశావర్కర్లు భాగ్యమ్మ, సుబ్బమ్మ, ఎఫ్ఏ మల్లికార్జునరెడ్డి, ఆకుల గంగిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

మహాయజ్ఞానికి తరలిన భక్త జనం



ముత్తుకూరు: విజయవాడలో ఈ నెల 12 నుంచి 17వ తేదీ వరకు నిర్వహిస్తున్న శ్రీలక్ష్మీ మహాయజ్ఞానికి కృష్ణపట్నం గ్రామం నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు మంగళవారం తరలివెళ్లారు. శ్రీసిద్ధేశ్వర-వేణుగోపాలస్వామి ఆలయాల చైర్మన్ పెద్దపాళెం సుబ్బయ్య భక్తుల ప్రత్యేక బస్సును జెండాఊపి ప్రారంభించారు. తొలుత ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు ఆచరించి భక్తిశ్రద్ధలతో మహాయజ్ఞానికి బయలుదేరి వెళ్లారు.

19న అంగన్‌వాడీ పోస్టులకు ఇంటర్వ్యూలు

పొదలకూరు : మండలంలోని శాంతినగర్, చెన్నారెడ్డిపల్లి అంగన్‌వాడీ కేంద్రాల్లో ఖాళీగా ఉన్న సహాయకుల పోస్టులకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఈ నెల 19న ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు సీడీపీఓ వీ విజయలక్ష్మి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. నెల్లూరు ఆర్డీఓ కార్యాలయంలో ఉదయం 9 గంటలకు జరిగే ఇంటర్వ్యూలకు దరఖాస్తుదారులు హాజరుకావాలని కోరారు.

రైతులకు రాయితీపై వ్యవసాయ పరికరాలు



వ్యవసాయ పరికరాలు అందజేస్తున్న ఏడీఏ రాజ్‌కుమార్

ఇందుకూరుపేట: ప్రభుత్వం వైఎస్సార్‌యంత్ర సేవా పథకం కింద రైతు గ్రూపులకు రాయితీపై వ్యవసాయ యంత్ర పరికరాలు అందజేస్తోందని ఇందుకూరుపేట ఏడీఏ రాజ్‌కుమార్ తెలిపారు. మండలంలోని జగదేవిపేట ఆర్‌బీకేలో జశ్వంత్ రైతుమిత్ర గ్రూప్‌నకు మినీట్రాక్టర్, రొటోవేటర్, పవర్ వీడార్, స్ప్రేయర్, బ్రష్ కట్టర్లను నలభైశాతం సబ్సిడీపై మంగళవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు గ్రూపుగా ఏర్పడి దరఖాస్తు చేసుకుంటే రాయితీపై వ్యవసాయ యంత్ర పరికరాలు అందజేస్తున్నట్లు తెలిపారు. ఈకార్యక్రమంలో ఏఓ రఘునాథ్‌రెడ్డి, వీఏఏ ఎన్ నవీన్, రైతులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు ప్లాస్టిక్‌ను నిషేధించాలి



ప్లాస్టిక్ వాడకాన్ని మానేస్తామని గ్రామస్తులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న ఎఫ్ఎస్ఓ

వెంకటాచలం: పర్యావరణ పరిరక్షకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని ఎఫ్ఎస్ఓ శేషయ్య కోరారు. కసుమూరులో అటవీశాఖ ఆధ్వర్యంలో మంగళవారం లైఫ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామంలోని వీధుల్లోని ప్లాస్టిక్ వస్తువులను తొలగించి పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెట్లను విచక్షణారహితంగా నరికేయడం వల్ల పర్యావరణం దెబ్బతింటుందని తెలిపారు. ప్రతిఒక్కరూ మొక్కలను నాటి సంరక్షించాలని కోరారు. ప్లాస్టిక్ వాడకంతో పర్యావరణానికి తీవ్రముప్పు ఏర్పడుతుందన్నారు. ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించాలని కోరారు. అనంతరం ప్రజలతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ఎఫ్‌బీఓ రాజేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే ప్రసన్నపై విమర్శలు తగవు

కోవూరు: కోవూరు నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యంగా ముందుకు సాగుతున్న ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డిపై జనసేన నాయకులు విమర్శలు చేయడం సిగ్గుచేటు అని మండల వైఎస్సార్‌సీపీ అనుబంధాల సంఘాల నాయకులు పేర్కొన్నారు. కోవూరులోని వైఎస్సార్‌సీపీ కార్యాలయలో మంగళవారం వారు విలేకరులతో మాట్లాడారు. జిల్లాలో నల్లపరెడ్డి కుటుంబానికి ప్రత్యేక రాజకీయ చరిత్ర ఉందన్నారు. నల్లపరెడ్డి శ్రీనివాసులరెడ్డి ఇరిగేషన్ మంత్రిగా జిల్లాలో సాగునీటి వనరుల అభివృద్ధికి ఎంతో కృషి చేశారని గుర్తుచేశారు. కోవూరు నియోజకవర్గంలోని మారుమూల ప్రాంతాలకు సైతం రోడ్లు,వంతెనలు, వాటర్ ట్యాంక్‌లు నిర్మించిన ఘనత నల్లపరెడ్డిలదే అన్నారు. కరోనా సమయంలో ప్రాణాలకు సైతం లెక్కచేయకుండా నిత్యం ప్రజల మధ్యనే ఉంటూ నల్లపరెడ్డి శ్రీనివాసులురెడ్డి ట్రస్టు తరపున ఎంతో మందిని ఆదుకున్న గొప్ప వ్యక్తి ఎమ్మెల్యే ప్రసన్న అని పేర్కొన్నారు. పెయిడ్ ఆర్టిస్టులు ఒళ్లు దగ్గర పెట్టుకుని మాట్లాడాలని, లేకపోతే కోవూరు ప్రజలే తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు. అనుబంధ సంఘాల అధ్యక్షులు చిరంజీవి, మల్లికార్జున, సుధాకర్, అంజనారావు, జేసీఎస్ కన్వీనర్ ప్రసాద్, కోఆప్షన్ సభ్యులు జుబేర్, ఎంపీటీసీ వేణుగోపాల్, మస్తాన్, మునెయ్య, తదితరులు పాల్గొన్నారు.

వీరాంజనేయుడికి సింధూర అలంకారం



ముత్తుకూరులో ఆంజనేయుడికి సింధూర అలంకారం

ముత్తుకూరు: హనుమజ్జయంతి ఉత్సవాల్లో భాగంగా స్థానిక వీరాంజనేయస్వామి ఆలయంలో మంగళవారం స్వామివారు సింధూర అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. అంజని పుత్రుడికి వివిధ పుష్పాలు, పత్రాలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కారిపాక మునివరప్రసాద్-శైలజ దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరించారు.

ఆంజనేయస్వామికి విశేష పూజలు

పొదలకూరు: పట్టణంలోని మారుతీనగర్‌లోని వీరఅభయాంజనేయస్వామికి మంగళవారం విశేష పూజలు నిర్వహించారు. ఉదయం విశేషాభిషేకాలు, ఆకు పూజ, సాయంత్రం పల్లకిసేవ నిర్వహించారు.

సచివాలయాల్లో తనిఖీలు

మనుబోలు: కలెక్టర్ ఆదేశాలతో మనుబోలు-2, చెర్లోపల్లి గ్రామ సచివాలయాలను డీఎస్ఓ వెంకటేశ్వర్లు మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. సచివాలయాల రికార్డులను పరిశీలించారు. స్పందనకు ఎన్ని అర్జీలు వచ్చాయి..ఎన్నింటిని పరిష్కరించారని సచివాలయ సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. సంక్షేమ పథకాల పోస్టర్లతో పాటు లబ్ధిదారుల జాబితాలను ప్రదర్శించాలని సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సచివాలయ సేవలు సంతృప్తికరంగా ఉన్నాయన్నారు. వచ్చే నెల నుంచి గ్రామీణ ప్రాంతాల్లో బియ్యంతో పాటు చక్కెర, కందిపప్పును సరఫరా చేస్తామని తెలిపారు. ఆయన వెంట సీఎస్‌డీటీ లక్ష్మీనారాయణరెడ్డి, వీఆర్వో వెంకయ్య, తదితరులు ఉన్నారు.

నేత్రపర్వంగా సీతారాముల కల్యాణం



కొడవలూరు: బసవాయపాళెంలో ప్రసన్నాంజనేయస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం సీతారాముల కల్యాణాన్ని నేత్రపర్వంగా నిర్వహించారు. సీతారాముల ఉత్సవమూర్తులను విశేషంగా అలంకరించి వేదపండితుల మంత్రోచ్ఛారణల నడుమ శాస్త్రోక్తంగా కల్యాణం నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై కల్యాణాన్ని తిలకించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పెళ్లేటి రజని, ఉపసర్పంచ్ మహిధర్, వైఎస్సార్‌సీపీ నాయకులు దువ్వూరు అనిల్‌కుమార్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.